# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [9]

~ అద్దంకి అనంత రామయ్య



**సీరియల్:** సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [9]

**రచన:** అద్దంకి అనంత రామయ్య

**ప్రచురణ:** కినిగె పత్రిక patrika.kinige.com

**కాలం:** మార్చి 2014

**శాశ్వత లింకు:** http://patrika.kinige.com/?p=1918

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [9]

*అత్యధికంగా అమ్ముడుపోయిన ఈ-పుస్తకంగా పేరు తెచ్చుకున్న "రామ్@శృతి.కామ్" రచయిత అద్దంకి అనంతరామయ్య రాసిన రెండవ హాస్య నవల ఈ "సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం". దీన్ని వారం వారం సీరియలైజ్ చేస్తున్నాం.* ***ఇది తొమ్మిదవ భాగం.***

దీని ముందుభాగం

చావటానికి సిద్ధపడ్డ అజయ్, తన కుడి చేతిలో బ్లేడు తీసుకొని, ఎడమ చేతిని ముందుకి చాపి, బ్లేడుతో తన ఎడమ చేతికి, లీలగా కనపడుతున్న నరాలను బ్లేడుతో కోశాడు. ఒక్కసారిగా భయంకరమైన నొప్పి పుట్టటంతో పెద్దగా అరిచాడు. బ్లేడుని అవతలికి విసిరేశాడు. అదృష్టమో, దురదృష్టమో చర్మం తెగిందే తప్ప నరాలు తెగలేదు. నొప్పి నరకాన్ని తలదన్నేట్టు ఉన్నది.

"చర్మం తెగితేనే ఇంత నొప్పి ఉంది. ఇంకా కోసుకుంటే తట్టుకోవటం నావల్ల కాదు" అని మనస్సులో అనుకోని, బ్లేడుతో చావాలనే ఆలోచనని విరమించాడు. కానీ రక్తం కారుతున్నది. కారుతున్న కొద్దీ నొప్పి రెట్టింపు అవుతున్నది. ఓర్చుకోలేక వెంటనే, దగ్గరలోని R.M.P డాక్టరు దగ్గరకి వెళ్ళాడు. ఆ రక్తాన్ని చూసి అతను నివ్వెరపోయాడు. ఏమైందని అడిగాడు. "వైరుని బ్లేడుతో కోస్తుంటే అనుకోకుండా చెయ్యి జారింది" అన్నాడు.

అతనికి తెలిసినంతలో ఏదో వైద్యం చేశాడు. రెండు ఇంజక్షన్లు చేశాడు. అరడజను టాబ్లెట్లు రాసి రోజుకి మూడు పూటలా వాడమన్నాడు. "దేనికిన్ని టాబ్లెట్లు" అని అడిగాడు. ఇది బలానికి, ఇది నొప్పులు తగ్గటానికి ,ఇది ఈ రెండు వాడినా ఇబ్బంది లేకుండా ఉండటం కోసం ,ఈ రెండు పనిచేయటానికి ఇంకో రెండు అనిచెప్పాడు. ఎలాగూ చావాలనుకున్న వాడికి ఇన్ని రకాల టాబ్లెట్లు ఎందుకని మనస్సులో అనుకున్నాడు. చిన్నగా అక్కడి నుంచి బయటపడి, ఒక మందుల షాపు దగ్గర ఆగాడు. డాక్టరు రాసిచ్చిన మందుల చీటీ బయటకు తీసి కేవలం నొప్పి తగ్గే మాత్రలు మాత్రం తీసుకున్నాడు.

మొదటి రోజుకి నొప్పి, రెండో రోజుకు కొంత తగ్గింది. మళ్ళీ చావు మీద మనస్సు మళ్ళింది అజయ్ కి. ఈ సారి ఎట్టి పరిస్థితులలో విఫలమవ్వకూడదని గట్టిగా అనుకున్నాడు. జాగ్రత్తగా ప్రణాళిక రచన చేసుకున్నాడు. ఈ సారి చచ్చినా బతకకూడదు. అనుకొన్నాడు. ఉరి వేసుకు చావటమనే మార్గాన్ని ఎంచుకున్నాడు. తానూ ఉంటున్న మేడ గట్టిదే, పైన తిరుగుతున్న రెక్కల ఫ్యాను కూడా గట్టిదే. తాడు కూడా గట్టిదే సంపాదించాడు. తన్నటానికి మంచి కుదమట్టమైన స్టూలు కూడా సిద్ధం చేసాడు. రాత్రి పూట భోజనం ముగించుకొని తన గదికి వచ్చాడు. తాడు తీసుకొని, ఉరి వేసుకోవటానికి స్టూలు ఎక్కాడు. కానీ ఉరి వేసుకోవటానికి ఆ తాడు ఎలా ముడి వేయాలో అర్థం కాలేదు. అర్థరాత్రి దాకా ప్రయత్నించాడు. అర్థం కాక అర్థాంతరంగా ఆ ప్రయత్నాన్ని ఆపేశాడు.

అదే స్టూలు మీద కూర్చొని ఆలోచించటం మొదలుపెట్టాడు. అసలు ఉరి వేసుకుంటే మనిషి ఎందుకు చస్తాడు? ఊపిరి ఆడకపోవటంతో చస్తాడు. కాబట్టి ఉరి వేసుకోకపోయినా ఊపిరి ఆడకుండా చేయగలిగితే మనిషి చచ్చినట్టే అన్న ఆలోచన చేశాడు. ఇప్పుడు ఊపిరి ఆడకుండా చేయటం ఎలాగా అని ఆలోచించాడు.

ఎదురుగా ఒక ప్లాస్టిక్ కవర్ కనబడింది, ఇంజనీరింగ్ చదివినన్నాళ్ళు కూడా వాడని బుర్రను ఇప్పుడు వాడటం మొదలుపెట్టాడు. ఆ ప్లాస్టిక్ కవర్ ముఖానికి ఊపిరి ఆడకుండా చేయచ్చు కదా అనే దరిద్రపు ఆలోచన తట్టింది. ఆలస్యం చేయకుండా ఆ ప్లాస్టిక్ కవర్ తలకు కప్పుకున్నాడు. ఒక మందపాటి పురికొస తీసుకొని ఆ కవర్ మీదుగా మెడ పైకి కట్టాడు. గాలి ఏమాత్రం ఆ కవర్ లోకి వెళ్ళకుండా జాగ్రత్తపడ్డాడు. ఆక్సిజన్ తీసుకోవటం ఇబ్బందిగా మారింది. కాసేపటికే ఓర్చుకోలేక, ఊపిరాడక, తనంతట తానే కవరుని చించేశాడు. అప్పుడు అజయ్ కి అర్థమైన విషయం ఏంటంటే ,మెడకన్నా ముందు చేతులు కట్టేసుకోవాలి, లేదంటే చేతులు వాటి పని అవి చేస్తాయని. కానీ చేతులు కట్టేసుకుంటే మెడకు కవరు ఎవరు కడతారని ఆలోచించాడు.

ఈ ప్రయత్నం కూడా విఫలమైనదని అర్థం అయింది అజయ్ కి. అప్పటికే సమయం తెల్లవారుఝాముున ఐదు అయ్యింది.చేసేది లేక అమాంతం మంచం మీద పది నిద్రపోయాడు. మద్యాహ్నం రెండు గంటలకు నిద్రలేచి, భోజనం చేసి మళ్ళీ తన గదికి వచ్చి ఆలోచించటం మొదలుపెట్టాడు. నొప్పి పుట్టకుండా తొందరగా చచ్చే మార్గం ఏదా అని? అజయ్ కి తట్టిన తరువాతి ఉపాయం విషం తాగటం. ఆ ఆలోచన అజయ్ చావుమీద ఆశను బ్రతికించింది. విషం తాగితే ఖచ్చితంగా చావచ్చు అనుకున్నాడు.

కానీ విషం ఎలా సంపాదించాలో అర్థం కాలేదు.ఇంటర్నెట్ లో విషం కోసం వెతికే ప్రయత్నం చేశాడు. అక్కడ కూడా విషం గురించిన విషయ సమాచారం దొరకలేదు. “రాష్ట్రంలో ఎంతమంది రైతులు పురుగుల మందు తాగి చావటం లేదు”, అనుకున్నాడు అజయ్. తానూ కూడా అన్నదాత అడుగుజాడల్లో నడవాలి అనుకున్నాడు. హైదరాబాద్ లో ఎంతసేపు సెల్ ఫోను షాపులు, బట్టల షాపులు తప్ప పురుగుల మందు షాపు కనపడలేదు. ఎందుకు లేవా? అని ఆలోచించాడు. “అయినా హైదరాబద్ లో పురుగుల మందు ఎవరికి అవసరం,ఉన్న చెట్లే నరికేస్తుంటే, ఎవడో నాలా చావబోయేవాడు తప్ప వాడరు కదా!” అనుకున్నాడు. చివరకు హైదరాబాద్ శివారు ప్రాంతాలలో ఒక పురుగుల మందు దుకాణం ఉందని తెలుసుకున్నాడు. పైగా అక్కడికి వెళ్లి కొంటే ఎవ్వరికి అనుమానం కూడా రాదనుకున్నాడు.

తన బండి తీసుకొని తర్వాత రోజు ఉదయాన్నే ఆ పురుగుల మందు దుకాణానికి వెళ్ళాడు. బండి ఆపి, షాపులోకి వెళ్లి, షాపంతా ఒకసారి పరిశీలించి చూశాడు. “ఏమి కావాలి బాబు” అడిగాడు షాపతను. “ఎండ్రిన్” కావాలి అని అడిగాడు అజయ్. ఎండ్రిన్ అనే మాట వినటంతోనే, అజయ్ వైపు అనుమానంగా చూశాడు ఆ కొట్లో అతను. భయపడితే అనుమానం కలుగుతుందని, ధైర్యంగా రెండోసారి “ఎండ్రిన్” కావాలి అని అడిగాడు. “దేనికి నీకు ఎండ్రిన్?” అని అడిగాడు. ఈ ప్రశ్న అడుగుతాడని ముందే ఊహించిన అజయ్ “చెట్లకి పురుగు పట్టకుండా చల్లటానికి” అని చెప్పాడు.

ఆయినా అతను నమ్మలేదు “ఏమి చెట్లు? ఎన్ని చెట్లు” అని ప్రశ్నించాడు. “టేకు చెట్లు, నాలుగున్నాయి మా ఇంటిముందు. వాటికోసమని నాన్న తీసుకురమ్మన్నారు” అని వినయం నటిస్తూ చెప్పాడు.

“అయినా ఇప్పుడు ఎండ్రిన్ రావటం లేదు.ఆపేసి చాలా ఏళ్ళు గడిచింది” అన్నాడతను. ఏమి చేయాలో తోచని స్థితిలో అజయ్ కి ఇంకో ఆలోచన వచ్చింది. నిజంగానే అజయ్ వాళ్ళింటి ముందు నాలుగు టేకు చెట్లు ఉన్నాయి. సెల్లు ఫోను కొన్న క్రొత్తలో అజయ్ సరదాగా వాటిని ఫోటోలు తీశాడు. అవి గుర్తుకు వచ్చాయి. వెంటనే జేబులోనుంచి సెల్లు తీసి ఆ నాలుగు చెట్లున్న ఫోటో తీసి, అతనికి చూపిస్తూ “ఇవే ఆ చెట్లు, వీటికి ఏ మందువేస్తే మంచిదో మీరే ఇవ్వండి” అంటూ ఫోను అతని ముందుకు నెట్టాడు. ఆ ఫోటో చూడటంతో అతని అనుమానం దాదాపు తీరింది. ఒక డబ్బా తీసుకొని వచ్చి, అజయ్ ని కూర్చోమని చెప్పాడు. తాను చెప్పినట్టే అజయ్ కూర్చున్నాడు. ఆ పురుగుల మందు ఎంత వాడాలి? ఎలా వాడాలి? అని పావుగంట వివరించి చెప్పాడు. అదంతా విన్నట్టే అజయ్ నటించాడు. అతనికి డబ్బులు ఇస్తూ, ప్లేటు బిర్యానీ కన్నా చావు చవకగా వస్తున్నదే” అని ఆనంద పడ్డాడు.

ఆ డబ్బా తీసుకొని మళ్ళీ తాను ఉంటున్న గదికి చేరాడు. తాను చావటం ఖాయం అనుకున్నాడు. “ఎలాగూ చావబోతున్నా కదా! ఇవాళ ఇష్టమైనవన్నీ తిని చచ్చిపోవాలి” అనుకున్నాడు.అసలే మంచి ఆకలి మీద ఉన్నాడు.వెంటనే కుకట్ పల్లీలో ఉన్న పుల్లారెడ్డి వారి దుకాణానికి వెళ్ళాడు. ఘుమఘుమలాడే వాసనలు స్వాగతం పలికాయి. ఆ వాసనలు చూసి, ఇవి తిని చచ్చినా పర్వాలేదు అనుకున్నాడు. అన్ని రకాలు కలిపి అరకేజీ కట్టించి, గదికి చేరాడు. వేడి వేడి అన్నంలో ఆవకాయ వేసుకొని, ఆరంగా ఆరంగా తిన్నాడు. తానూ కొనుక్కొచ్చిన స్వీట్లన్నీ, ఒక్కటి కూడా వదలకుండా పీకలదాకా మింగాడు.తృప్తిగా తిని చావటానికి సిద్ధమయ్యాడు.

తానూ తెచ్చిన పురుగుల మందు డబ్బాను తీశాడు. ఒక గ్లాసులో పురుగుల మందును పోసుకొని మిగిలిన సీసాని బయటకు విసిరేశాడు, ఒకవేళ తన దరిద్రం వల్ల ఈ సారి కూడా

చావకపోతే, ఎవ్వరికీ పురుగుల మందు తాగాడన్న అనుమానం రాకుండా. గదంతా పురుగుల మందు వాసనతో నిండిపోయింది. కళ్ళు, ముక్కు మూసుకొని, నోరు తెరిచి ఆ గ్లాసులో ఉన్న మందుని మజ్జిగ తాగినట్టు తాగేశాడు. కానీ అది కటిక చేదుగా ఉండటంతో సగం ఉమ్మేశాడు. రెండు మూడు గుటకలు మాత్రమే మింగాడు. నోరంతా వికారంగా అనిపించింది. కాసేపటికి వాంతులు మొదలయ్యాయి, ఇంకాసేపటికి వాంతులకు తోడు విరేచినాలు కూడా విజృంభించాయి. ఒంట్లో ఉన్న సమస్తం బయటకు వచ్చాక, పేగులు, ఎండాకాలం హైదరాబాదులో నీటు పంపుల మాదిరి ఖాళీ అయ్యాయి. మరి కాసేపటికి స్పృహ కోల్పోయాడు.

అర్ధరాత్రి పది గంటల ప్రాంతంలో, ఒక యమభటుడు వచ్చి అజయ్ ని పైకి తీసుకెళ్తున్నాడు. “చచ్చి బతికానురా” అనుకున్నాడు అజయ్. “నేనిప్పుడు నరకానికి వెళ్తానా? స్వర్గానికి వెళ్తానా?” అని ఆలోచించాడు. “ఆత్మహత్య పాపం కనుక ఖచ్చితంగా నరకానికే వెళ్తాను, అందుకే కదా యమభటుడు వచ్చింది” అనుకున్నాడు. “అయినా నాకు నరకం వద్దు, నన్ను మోసం చేసి వేరేవాడిని పెళ్లి చేసుకున్నందుకు, నిషా కూడా ఏదో ఒక రోజు నరకానికి వస్తుంది. దానిని చూడటం నాకు ఇష్టం లేదు. అక్కడ కూడా మగాళ్ళకు వేరుగా ఆడవాళ్ళకి వేరుగా ఉంటే బాగుండును. ఒకవేళ అందరికీ ఒకటే నరకమైనా నాకు ఇబ్బందేముందిలే, ఒకళ్యా? ఇద్దరా? కొన్ని కోట్ల మంది ఉంటారు నరకమంటే” అని ఆలోచిస్తుండగా ఒక అనుమానం వచ్చింది, “నిజంగానే నేను నరకానికి వెళ్తానా, లేదంటే ఈగ సినిమాలో చూపించినట్టు, ఏ ఈగ గానో , దోమ గానో పుడతానా? ఆ పుట్టేదేమో ప్రేమలేని క్రూర జంతువులా పుట్టాలి. నన్ను జూలో పెడితే , పొరపాటున అది చూడటానికి వస్తే , దాని మీదకు దూకి చంపేస్తా.

ఏ సింహం గానో పులి గానో పుడితే సుఖంగా బ్రతికేయచ్చు. అలా పుట్టినా మగ సింహం లానే పుడతానా? ఈగ సినిమాలో అది ఆడ ఈగో ,మగ ఈగో రాజమౌళి చెప్పలేదే . సింహం కాకపోయినా, కనీసం అమెరికాలో కుక్కగా పుట్టించినా చాలు. అక్కడ మనుషుల కన్నా పెంపుడు జంతువులనే

ఎక్కువగా ప్రేమిస్తారట! అందమైన అమెరికా అమ్మాయి ఎవత్తో నన్ను పెంచుకోబోదు" అనుకున్నాడు. ఆ యమ భటుడుని చూడగానే అజయ్ కి ఒక అనుమానం వచ్చింది. వెంటనే ఆ యమదూతను పిలిచి "సాదారణంగా సినిమాలన్నింటిలో ఇద్దరు ఇద్దరు యమదూతలు వస్తుంటారు కాదా! నువ్వేంటి ఒక్కడివే వచ్చావు?" అని అడిగాడు. "ఒకప్పుడు అలానే వచ్చేవారు! పాపుల సంఖ్య పెరిగే సరికి ఒక్కొక్కళ్ళం ఇద్దరు ముగ్గురిని తీసుకెళ్తున్నాం" అని చెప్పాడు. దూరంగా నరక ద్వారం దర్శనమిచ్చింది. వైతరిణీ నది మీదుగా నరకానికి వెళ్తూ ఉండగా ఉండగా మధ్యలో ఒక నల్లని మబ్బు ఒకటి అడ్డంగా వచ్చించి. ఆ మబ్బుకు అజయ్ కళ్ళు మూసుకుపోయాయి.

[తరువాయి భాగం వచ్చే వారం]

For Latest Telugu Books - Visit now:
Kinige.com